క్లుప్తంగా

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులతో క్యారంబోర్డు ఆడిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని విద్యార్థులు, యువతీ, యువకులు, నిరుద్యోగులు గ్రంథాలయాలన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ కౌసల్య సూచించారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల చేత స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలు, భారతదేశ చరిత్ర, నీతి కథలు తదితర పుస్తకాలు చదివించారు. అదేవిధంగా విద్యార్థులచే క్యారంబోర్డు, తొక్కుడు బిళ్ల, కబడ్డీ తదితర క్రీడలను ఆడించారు.

మినుము రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

పాములపాడు: ప్రకృతి వైపరీత్యాల వల్ల రబీ సీజన్‌లో నష్టపోయిన మినుము రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు రామేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగన రోజున కురిసిన అకాల వర్షం వల్ల మినుము పంట పూర్తి దెబ్బతిని, రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ పరిమాణాన్ని ప్రకృతి విపత్తుగా పరిగణించి ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సామన్న, నాయకులు వెంకటేశ్వరరావు, రమణమ్మ, బాలయేసు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకాల పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలోని అంకాల పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దేవస్థానంలో అంగరంగ వైభవంగా నాగ ప్రతిష్ఠోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం వార్షికోత్సవ పూజలు, హోమాలు చేపట్టారు. శిఖర కుంభాభిషేకం అలాగే అశ్వత్థ నారాయణ కల్యాణం (రావి చెట్టు వేప చెట్టు కళ్యాణం) నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు, నూతన విగ్రహాలను ఊరేగించారు. ఈ నెల 27 సోమవారం ఉదయం 7:30 నుంచి యంత్ర స్థాపన నాగ ప్రతిష్ఠ పూర్ణాహుతి, విశేషంగా రాముల వారి కల్యాణం నిర్వహిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు బుడ్డా శేషారెడ్డి తెలిపారు.

తొగట వీరక్షత్రియ సంఘం గౌరవాధ్యక్షుడిగా రవీంద్రుడు



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న తొగట వీర క్షత్రియులు

వెలుగోడు: నంద్యాల జిల్లా తొగట వీరక్షత్రియ సంఘం గౌరవ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన యాదాటి నాగేంద్రుడు ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయులు తెలిపారు. ఆదివారం నందవరంలోని చౌడేశ్వరి ఆలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. గౌరవ సలహాదారునిగా నీలం వెంకట రామయ్య, కార్యవర్గ సభ్యులుగా గద్దె సుబ్రహ్మణ్యం, పోతుగంటి శేషయ్య వెలుగోడు మండలం నుంచి ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని ఆ సంఘం నాయకులు సత్కరించారు.

మహానందిలో సండే సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు స్వామి, అమ్మవారి దర్శనం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

అభివృద్ధి పరుగులు

- ఆత్మకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు
- పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల వేగవంతం
- త్వరలో పార్కుల ఏర్పాటుకు శ్రీకారం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో దాదాపు 20 వార్డుల్లో ఈ పనులు ప్రారంభమయ్యాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో నగర పంచాయతీగా ఉండగా పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టింది లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీగా మార్పు చేసి ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు చేపడుతున్నారు. వివిధ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీపనులు చురుగ్గా సాగుతుండగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, మున్సిపల్ అధికారులు దగ్గరుండి వీటిని పర్యవేక్షిస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధుల వరద

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆత్మకూరును మున్సిపాలిటీగా మారుస్తూ జీఓ విడుదల చేసింది. ప్రస్తుతం ఆత్మకూరు మున్సిపాలిటీ నిధులతో పాటు ఫైనాన్స్ కార్పొరేషన్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో 14వ ఫైనాన్స్ నిధుల కింద కళాంజోరి గ్రాఫిక్ నుంచి ధర్మారెడ్డి ఇంటి వరకు వార్డు 19లో రూ.5 లక్షలతో, అదే ఏడాది గంగమ్మ ఇంటి నుంచి ముర్తుజావలి ఇంటి వరకు రూ.6 లక్షలు, 2021, 22లో సుభాని ఇంటి నుంచి కోనేరు పబ్లిక్ వరకు రూ.21 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆత్మకూరు పట్టణంలోని అభివృద్ధి పనులు తీరును పరిశీలిస్తే 14వ ఫైనాన్స్ నుంచి 48 పనులకు రూ.3కోట్ల 78 లక్షలు, 14వ ఫైనాన్స్‌లో 60 పనులకు రూ.2 కోట్ల70 లక్షలు, ఎస్ఎస్‌సీ కింద మూడు పనులకు సంబంధించి రూ.75 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద 58 పనులకు రూ.కోటి 60 లక్షలు, వైఎస్సార్ అర్బన్ హెల్త్ కేంద్రానికి రూ.80 లక్షలు చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. పట్టణంలోని24 వార్డుల్లో 20 వార్డుల్లో సీసీరోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం 3 సంవత్సరాల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.9కోట్ల 63 లక్షలతో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి.



జోరుగా సాగుతున్న సీసీరోడ్డు పనులు, (ఇన్‌సెట్) డ్రైనేజీ నిర్మాణం

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక

ఆత్మకూరు పట్టణంలో వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా దాదాపు రూ.25 లక్షలతో మంచినీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు. నీటి సమస్య ఏర్పడితే ఆయా కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పట్టణంలో ఈ ఏడాది నీటి సమస్య తలెత్తకుండా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ అధికారులు చెప్పారు.

ఆహ్లాదంకోసం పార్కుల ఏర్పాటు

పట్టణంలో ఆహ్లాద వాతావరణం కోసం పార్కులు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ముందస్తుగా పార్కుల ఏర్పాటు కోసం కావాల్సిన స్థల అన్వేషణలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. ఇప్పటికే ఏ ఏ కాలనీల్లో పార్కులు ఏర్పాటు చేయాలనే దానిపై ప్రణాళికలను సిద్ధం చేశారు.

పట్టణంలో పనులు జోరుగా సాగుతున్నాయి



ఆత్మకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. రోడ్లు, కాలువలు వేయడంతో ఇబ్బందులు తప్పాయి. అలాగే పట్టణంలో పార్కులు త్వరగా ఏర్పాటు చేస్తే ఉదయం వేళ మార్నింగ్‌వాక్, కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు వీలుగా ఉంటుంది.

– వరాల మాలిక్, ఆత్మకూరు

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



ఆత్మకూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. పార్కులు ఏర్పాట చేసేందుకు కృషి చేస్తున్నాం. ఎక్కడెక్కడ పార్కులు ఏర్పాటు చేయాలి, ఏఏ కాలనీల్లో వీటిని ఏర్పాటు చేయాలి తదితర అంశాలపై దృష్టి సారించాం. త్వరలో వీటితో పాటు అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాట్లు చేస్తాం.

–ఆసియామారూఫ్, మున్సిపల్ చైర్‌పర్సన్, ఆత్మకూరు

వేగవంతంగా పనులు



ఆత్మకూరు మున్సిపాలిటీలో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న నిధుల ద్వారా పట్టణంలోని అన్నికాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీపనులు పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం.

– నరేష్, మున్సిపల్ ఏఈ

నేడు ఎమ్మెల్యే పర్యటన

కొత్తపల్లి: నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సోమవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో పర్యటించనున్నారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథరెడ్డి ఫంక్షన్ హాల్‌లో మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల కు, నాయకులు, మండల కో–ఆర్డినేటర్లు, సచివాల య కన్వీనర్లు, గృహసారథులతో సమావేశమవుతారు.

ఆత్మకూరులో 'ధర్మరక్ష లివింగ్'

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్మరక్షణ లివింగ్ కార్యక్రమం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు మారబోతుల సుబ్రహ్మణ్యం హరీష్, చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశం సుభిక్షంగా ఉండాలంటే ధర్మం, న్యాయానికి సమాజంలో ప్రముఖ స్థానం ఉండాలన్నారు. అనంతరం ధర్మరక్షణ లివింగ్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రచారకులు శ్రీధర్‌గుప్త, ఆవులరెడ్డి, విజయభాస్కర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకి పతనం తప్పదు'

జూపాడుబంగ్లా: ఎస్సీ రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి మోసగించిన బీజేపీ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు బాయకట్టి బెనర్జీ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ సాధనకోసం కర్నూలు జిల్లా నుంచి అమరావతి వరకు చేస్తున్న పాదయాత్ర ఆదివారం జూపాడుబంగ్లాకు చేరుకుంది. బెనర్జీ మాట్లాడుతూ బీజేపీ, టీడీపీలు ఎస్సీ వర్గీకరణ చేస్తామని మభ్యపెట్టి రిజర్వేషన్ కల్పించకుండా మోసగించాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయమై తాడోపేడో తేల్చుకొనేందుకుగాను మార్చి 15న అమరావతి ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఎస్సీల సత్తాచూపించనున్నట్లు తెలిపారు.ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసాదు, సురేష్, షీమోను, నాగార్జున పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్ లవన్న , అర్చక వేదపండితులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా, చైర్మన్, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి స్వామివార్ల జ్ఞాపికను అందజేస్తున్న చైర్మన్, ఈఓ

మానవతా దృక్పథంతో వైద్యం చేయాలి

జూపాడుబంగ్లా: వైద్యం పేరుచెప్పి పేద ప్రజలను డబ్బు కోసం పీల్చిపిప్పిచేయవద్దని, మానవతా దృక్పథంతో చికిత్సలు అందించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ వైద్యులను కోరారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని కర్నూలు రోడ్డులో నూతనంగా నిర్మించిన ఓ ప్రైవేటు ఆసుపత్రిని ప్రారంభించారు. గర్భిణులకు వీలైనంత సుఖ ప్రసవాలు చేయాలన్నారు. ప్రజల వద్ద అధిక ఫీజులు వసూళ్లు చేయకుండా మానవత్వంతో చికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో రబ్బాని గ్రూప్స్ అధినేత తాటిపాడు మాబుసాహెబ్, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ జుబేర్ అహమ్మద్, చైర్మన్ డాక్టర్ జహీర్ అహమ్మద్, సీనియర్ అడ్వకేట్ నజీర్‌అహమ్మద్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్లు రమాదేవి, షకూర్‌మియ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోటలో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తెలుగు కురుమన్న కూతురు హరిత వివాహ రిసెప్షన్ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

విభిన్నమైన ప్రేమ కథా చిత్రం 'ఏది ప్రేమ'

నంద్యాల(అర్బన్): ప్రేమకథలకు భిన్నంగా 'ఏది ప్రేమ' అనే చిత్రాన్ని స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రంగా తీస్తున్నట్లు నిర్మాత రమేష్ తోడేటి తెలిపారు. ఏది ప్రేమ చిత్రం ప్రారంభంపై పట్టణంలో టీఆర్ ప్రొడెక్షన్స్ నిర్వాహకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. నిర్మాత మాట్లాడుతూ టీఆర్ ప్రొడెక్షన్స్ బ్యానర్‌పై ఏదిప్రేమ అనే సినిమా తీసి నిర్మాతల వరుసలో మన ప్రాంత వాసిగా నిలవాలనేది తన కోరిక అన్నారు. నూతన నటీ, నటులతో నంద్యాల ప్రాంత అందాలను ప్రేక్షకులకు చూపించాలనే కోరికతోనే మార్చి 25న సినిమా చిత్రీకరణ ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలోని పచ్చటి పొలాలు, అందమైన కొండలు, నల్లమల అడవి అందాలు, పవిత్ర పుణ్యక్షేత్రాల వద్ద, పురాతన కట్టడాల పరిసరాల్లో చిత్రీకరణ పూర్తిచేస్తామన్నారు. తక్కువ బడ్జెట్‌తో తెలుగు, కన్నడ, తమిళ్ భాషల్లో సినిమాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ముత్తాకుమార్, మ్యూజిక్ డైరెక్టర్ ఆల్‌డ్రీన్, కెమెరామెన్ లక్ష్మీనారాయణ, హీరోయిన్ విద్యాకృష్ణ, హీరోలు తోక కార్తీక్, అమన్, రామదుర్గా, నాగపుల్లయ్య, కిశోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్మాత రమేష్ తోడేటి

ఆటోలో నుంచి జారిపడి వృద్ధురాలికి తీవ్రగాయాలు

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామ సమీపంలో ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఎంగమ్మ అనే వృద్ధురాలికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. రుద్రవరం మండలం ఆలమూరు, లింగందిన్నె గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు మండలంలోని మాయలూరు గ్రామ సమీపంలో ఓ రైతు పొలంలో కూలీ పనుల నిమిత్తం వచ్చారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లే సమయంలో ఆటో అతి వేగంగా మలుపు వద్ద తిప్పడంతో వృద్ధురాలు జారి కింద పడింది. ఉయ్యాలవాడలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పూజల అనంతరం కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయమని లయన్స్ గవర్నర్ రామచంద్రప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం లయన్స్ జిల్లా పర్యటన సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక స్నేహ వృద్ధాశ్రమానికి లయన్స్ యువజన విభాగం 150 కేజీల కందిబేడలు అందజేసిన అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. నంద్యాల శివారులో లయన్స్‌క్లబ్ స్వాగత బోర్డును ఆవిష్కరించారు. క్రాంతినగర్‌లోని జీవన జ్యోతి అంధుల వసతి గృహానికి ఆహార సరుకులను అందజేశారు. సంఘమిత్ర బాలురకు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి సౌజన్యంతో నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. మహానంది రోడ్డులోని బాలికల ఛాత్రాలయంలో కాస్మోటిక్ కిట్లుఅందజేశారు. నంద్యాల వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద దివ్యాంగులకు హెల్త్‌కార్డులు, నెలవారి మందులు, చంక కర్రలను పంపిణీ చేశారు. బాలాజీ కల్యాణ మండపంలో క్లబ్ సభ్యుల విరాళాలతో 19 కుట్టు మిషన్లు, 13 వినికిడి మిషన్లు, 9 చక్రాల కుర్చీలు దివ్యాంగులకు అందజేశారు. అలాగే జిల్లా జీతునేడో కరాటే సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్, కూరప్రసాద్, రత్నకుమార్, రమణయ్య, చంద్రశేఖర్, భవనాశి నాగమహేష్, భద్రిశెట్టి శ్రీకాంత్, డాక్టర్ వినోద్, పవన్ పాల్గొన్నారు.



దివ్యాంగులకు వీల్‌చైర్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేసిన దృశ్యం

నిలిచిన పనులు.. గుడిసెలోనే విధులు

- గడువు ముగిసినా పూర్తికాని విద్యుత్ ఆపరేటింగ్ గది నిర్మాణం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్
- సిబ్బందికి తప్పని అవస్థలు

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల విద్యుత్ ఉపకేంద్రం వద్ద శిథిలమైన ఆపరేటింగ్ గదులను రెండేళ్ల క్రితం క్రితం కూల్చివేశారు. దాని స్థానంలో ట్రాన్స్ అధికారులు రూ.5లక్షల వ్యయంతో నూతన ఆపరేటింగ్ గది నిర్మాణం పనులు ప్రారంభించారు. అయితే పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాదిపైగా అవుతున్నా గదిని నిర్మించకుండా కాలయాపనచేస్తున్నాడు. దీంతో విద్యుత్ ఉపకేంద్రం ఆపరేటింగ్ సిబ్బంది తేళ్లు, పాముల మధ్య గుడిసెలో రాత్రి వేళల్లో ప్రాణభయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎప్పుడు తమకు పాములు, తేళ్ల రూపంలో ప్రమాదం పొంచి ఉందోనని సిబ్బంది బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకొని త్వరగా ఆపరేటింగ్ గది నిర్మాణం పనులు పూర్తిచేయించాలని సిబ్బంది కోరుతున్నారు.



పారుమంచాల విద్యుత్ ఉపకేంద్రం వద్ద మధ్యలో నిలిచిపోయిన విద్యుత్ ఆపరేటింగ్ గది



సిబ్బంది విధులు నిర్వహిస్తున్న గుడిసె

కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెడతాం

ఈ విషయమై ట్రాన్స్‌కో సివిల్ ఏఈ గురురాఘవేంద్రను వివరణ కోరగా ఇప్పటికే గది నిర్మాణం పనులు పూర్తిచేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. త్వరగా పనులు పూర్తిచేయాలని అనేకమార్లు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. అయినా లెక్కచేయటం లేదు. అతడిని బ్లాక్‌లిస్టులోపెట్టి మరొకరికి పనులు అప్పగించాలని ఎస్ఈకి నివేదించాం.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

మహానంది: పాతకక్షల నేపథ్యంలో ఈనెల 13న ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న చెవుల శ్రీనివాసులు(45) కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు మహానంది ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన చెవుల శ్రీనివాసులు, ఫక్కీరమ్మల మధ్య ఈ నెల 13న రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఫక్కీరమ్మను తిడుతున్నాడన్న కారణంతో ఇరువురి మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఫక్కీరమ్మ బంధువులైన బోయిలకుంట్ల, తమ్మడపల్లె గ్రామాలకు చెందిన మణిమహేష్, నరసింహుడు, శివరాముడు, మరికొందరు చెవుల శ్రీనివాసులుపై కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేసి గాయపరిచారు. తలకు తీవ్రంగా గాయమైన ఆయనను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. శ్రీనివాసులు ఇదివరకే ఫిర్యాదు చేసిన మేరకు నమోదైన హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్పు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని బంధువులు తెలిపారు.

దూదేకుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): దూదేకుల సంఘం పట్టణ అధ్యక్షుడిగా వాసవి దస్తగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక వాసవీ స్కూల్‌లో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని మాజీ అధ్యక్షుడు కాశీం , కార్యదర్శి దస్తగిరి, హుసేన్‌బాషా ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్, డాక్టర్ చమన్, మహమ్మద్, దస్తగిరి హాజరయ్యారు. ఉపాధ్యక్షులుగా సీడ్స్ బాబు, కన్నయ్య, జైనాబీ, బాషా, శంషావలి, ప్రధాన కార్యదర్శిగా ఆదాం సాహెబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా హుసేనప్ప, కోశాధికారిగా సోమశేఖర్‌తో పాటు 9మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులను సంఘం నాయకులు సన్మానించారు.

మహిళలు స్వయం కృషితో ఎదగాలి

నంద్యాల(వ్యవసాయం): మహిళలు స్వయం కృషితో ఎదగాలని కర్నూలు జిల్లా పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం స్థానిక సంజీవనగర్‌లోని భద్రావతి భావనారుషి కల్యాణ మండపంలో పద్మశాలీయ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని సమాజంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అంనతరం సంఘం ఆధ్వర్యంలో 50 మందికి కుట్టుమిషన్లు అందజేశారు.

జవాన్ల కోసం ప్రార్థనలు చేయండి



మాట్లాడుతున్న అబ్దుల్ గఫార్

దొర్నిపాడు: చలి, ఎండ, వానల్లో జవాన్లు మన కోసం శ్రమిస్తున్నారని, వారి క్షేమం కోసం ప్రతి ఒక్కరూ వారిని గుర్తుచేసుకోని ప్రార్థనలు, పూజలు చేయాలని సామాజిక ప్రసంగీకుడు మర్రిపల్లె అబ్దుల్ గఫార్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన ఆటో యాత్ర నిర్వహించి జవాన్ల సేవలు, వారి గొప్పతనం గురించి వివరించారు. మనం ఇళ్ల వద్ద ఎలాంటి భయం లేకుండా జీవిస్తున్నామంటే జవాన్ల త్యాగఫలమేనని పేర్కొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

ఉయ్యాలవాడ : రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందని, మార్కెట్‌లో వాటికి మంచి ధర లభిస్తుందని, రైతులు సాగు చేసి లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ఇంజేడు, హరివరం, మాయలూరు రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలను ఈ– క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీలోపు ఈ-కేవైసీ తప్పనిసరిగా ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ఏఈఓ వెంకటేశ్వరరెడ్డి, రాణెమ్మ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

లోకేష్ మాటలను ప్రజలు విశ్వసించరు

నంద్యాల(అర్బన్): అధికారం కోసం యాత్ర పేరుతో విన్యాసాలు చేస్తున్న పిట్టలదొర లోకేష్ మాటలు నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని, ఆయన పాదయాత్రల వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయే తప్ప ఎలాంటి ఉపయోగం లేదని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రలో జనాలు కనపడక స్థానిక నేతలపై చంద్రబాబు ఆగ్రహంవ్యక్తం చేయాల్సి దుస్థితి తలెత్తిందన్నారు. సభల్లో లోకేష్ ప్రసంగం ప్రజలను ఆకట్టుకోలేకపోతుందని, చివరకు యాత్ర ఎందుకు చేస్తున్నామో కూడా ఆ పార్టీ నాయకులకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, నారా లోకేష్ ప్రజలను బానిసలుగా మార్చాలనే దురద్దేశంతో వారి హయాంలో ప్రజలను నిర్లక్ష్యం చేశారన్నారు. రాజధాని మార్పు జరిగితే దందా వ్యాపారం బయట పడుతుందనే ఉద్దేశంతో రాజధాని అమరావతిలోనే ఉండాలని చెబుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గిరిజనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాధాన్యతను కల్పిస్తున్నారని కొనియాడారు. జీపీఎస్ నాయకులు బాలునాయక్, రవినాయక్, మల్లేష్ నాయక్, విక్రమ్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజునాయక్

బస్టాండ్‌లో బిల్కు.. ప్రయాణికులకు ఇక్కట్లు

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌లో బిల్క్ (రాళ్ల బిచ్చులు) వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూరు బస్టాండ్ అభివృద్ధి కోసం రూ.కోటి 3లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగా ప్లాట్‌ఫామ్స్ ఏర్పాటు కాగా ప్రస్తుతం బిల్క్ వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి బిల్క్‌ను బస్టాండ్‌లోని ప్లాట్‌ఫామ్స్ వద్ద సిమెంట్ తొలగించి కింద భాగంలో వేయాల్సి ఉంది. అయితే సిమెంట్ పైనే వేశారు. ప్రస్తుతం గుండ్రాళ్లను తల పిస్తున్న రాళ్లను వేయడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బిల్క్‌ను రోలర్‌తోనైనా చదును చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆత్మకూరు బస్టాండ్ లో వేసిన బిల్క్